ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 తమిళనాడు TAMILNADU
శనివారం 3 ఆగస్టు 2024



కాళికాంబాళ్ ఆలయానికి రజత రథం

277 కిలోల వెండి అందించిన మంత్రి శేఖర్‌బాబు

అడయార్, ఆగస్టు 2: స్థానిక ప్యారిస్‌లోని కాళికాంబాళ్ ఆలయానికి రూ.2.17 కోట్లతో వెండి రథాన్ని తయారు చేయనున్నారు. ఈ రథం తయారీకి అవసరమయ్యే 277 కేజీల వెండిని రాష్ట్ర హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు శుక్రవారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రూ.58.28 కోట్లతో 97 చెక్క రథాలను తయారు చేయడంతో పాటు రూ.11.38 కోట్లతో 50 రథాలకు మరమ్మతులు చేశామన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 68 బంగారు రథాలు, 55 వెండి రథాలున్నాయన్నారు. వీటిలో 11 యేళ్ళుగా తిరగని రామేశ్వరం బంగారు రథం, పదేళ్ళుగా ఒకేచోట నిలిపివున్న సమయపురం మారియమ్మన్ బంగారు రథం, 9 యేళ్ళుగా నిలిపివున్న సేలం కోట్టై మారియమ్మన్ బంగారు రథం, ఐదేళ్లుగా ఊరేగింపు జరగని తిరుత్తణి బంగారు రథాలకు ఇపుడు మరమ్మతు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 5 బంగారు, 9 వెండి రథాలను చేస్తామని ప్రకటించామన్నారు. ఇందులో రూ.4 కోట్లతో తిరుత్తణి ఆలయానికి వెండి రథం తయారు చేసి మాఢ వీధుల్లో ఊరేగింపుగా వస్తుందన్నారు. అదే విధంగా ప్యారీస్‌లోని కాళికాంబాల్ ఆలయానికి రూ.2.17 కోట్లతో 277 కేజీల వెండితో వెండి రథాన్ని తయారు చేస్తున్నామన్నారు. వచ్చే ఆరు నెలల్లో ఈ రథం నిర్మాణ పనులు పూర్తవుతాయని తెలిపారు. డీఎంకే ప్రభుత్వంలో 1922 ఆలయాలకు కుంభాభిషేకాలు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రూ.6,447 కోట్ల విలువైన ఆలయ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో 1,70,081 ఎకరాల ఆలయ భూములను సర్వే చేసి, సరిహద్దు రాళ్ళను వేసినట్టు మంత్రి శేఖర్ బాబు వెల్లడించారు.

ఉన్నత విద్యకు పెద్దపీట

విదేశాల్లో చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ఫీజు, రవాణా ఖర్చు అంతా ప్రభుత్వానిదే

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



దివ్యాంగ విద్యార్థి కిషోర్‌కు ల్యాప్‌టాప్, ప్రశంసా పత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో చేరే విద్యార్థుల విద్యా ఫీజు, ప్రయాణ ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. స్థానిక కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో విదేశాల్లోని విద్యా సంస్థల్లో చదివేందుకు వెళ్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభినందన సభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ముందుగా తమిళనాడు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యలో చేరుతున్న కాంచీపురానికి చెందిన దివ్యాంగ విద్యార్థి కిషోర్ ను అభినందిస్తూ ల్యాప్‌టాప్, ప్రశంసా పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... అన్నాదురై పేరుతో ఏర్పాటైన గ్రంథాలయంలో తమిళనాడు విజ్ఞాన నేత్రాలైన విద్యార్థులకు అభినందన సభ జరుగుతోందని, భారతీదాసన్ ఇప్పుడు జీవించి ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్న విద్యార్థులను అభినందించేవారన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగితే ఉపాధ్యాయులకు, పిల్లలు ఎదిగితే తల్లిదండ్రులు గర్విస్తారన్నారు. రాష్ట్ర విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నారని కొనియాడారు. 54 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉన్నత విద్యాసంస్థల్లో అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలను సృష్టించి, సమాజానికి, దేశానికి అందించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందిస్తున్నామన్నారు. పదేళ్ల అనంతరం ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థల్లో చదివేందుకు ఎక్కువ మంది విద్యార్థులు వెళ్తున్నారన్నారు. 'పుదుమై పెణ్' ద్వారా కళాశాలల్లో చేరే విద్యార్థినుల సంఖ్య 34 శాతానికి పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నిలిపిందన్నారు. సాంకేతికతను ఉపయోగించి బోధనా నైపుణ్యాలను ఆధునీకరించడంలో విద్యాశాఖ పనితీరు అభినందనీయమన్నారు. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థుల సంఖ్య దేశంలోనే తమిళనాడులో అధికంగా ఉందని తెలిపారు. నేషనల్ లా ట్రైనింగ్ సెంటర్, ఏరోస్పేస్ డిపార్ట్‌మెంట్ తదితర ఉన్నత విద్యాసంస్థల్లో రాష్ట్ర విద్యార్థులు చేరారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రపంచంలోని ఉన్నత విద్యా సంస్థల్లో చేరడం వల్ల సామాజిక, ఆర్థికాభివృద్ధిలో మార్పు వస్తుందని కొనియాడారు. ఉన్నత విద్య చదువుతున్న రాష్ట్ర విద్యార్థులకు భద్రత కల్పించాలని తైవాన్, మలేసియా దేశాల రాయబారులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. విద్యార్థులకు ప్రతిభ ఉంటే ఎన్ని అడ్డంకులైనా అధిగమించవచ్చని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



దుబాయ్ కేంద్రంగా సెక్స్ రాకెట్ !

- కల్చరల్ నైట్ పేరుతో తరలింపు
- నక్షత్ర హోటళ్ళలో వ్యభిచారం
- సమాచారం చేరవేసిన ఎన్ఐఏ
- రంగంలోకి దిగిన నగర పోలీసులు

అడయార్, ఆగస్టు 2 : దుబాయ్ కేంద్రంగా గుట్టుచప్పుడుకాకుండా సాగుతున్న సెక్స్ రాకెట్ గుట్టు రట్టయింది. ఈ రాకెట్‌కు సంబంధించి పక్కా ఆధారాలు నగర పోలీసులకు అందాయి. దీనిపై పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశం మేరకు చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ చేపట్టిన ప్రాథమిక విచారణలో ఈ వ్యభిచార దందా విషయం వెలుగు చూసింది. దీంతో సీసీబీ అదనపు కమిషనర్ సెంథిల్ కుమార్, యాంటి ఉమెన్స్, చిల్డ్రన్స్ విభాగం ఎస్పీ వనిత, వ్యభిచార నిరోధక విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాజలక్ష్మితో కూడిన బృందం రంగంలోకి దిగి లోతుగా విచారణ చేపట్టింది. ఈ బృందం మే నెలలో మడిపాక్కంకు చెందిన రాజ్, జయకుమార్, దురైపాక్కంకు చెందిన అభియ అనే ముగ్గురు మధ్యవర్తులను అరెస్టు చేసింది. వీరివద్ద జరిపిన విచారణలో అనేక ఆసక్తిక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

కేరళ డ్యాన్సర్‌తో మొదలు...

కేరళ రాష్ట్రానికి చెందిన 21 యేళ్ళ ప్రముఖ డ్యాన్సర్‌ను కల్చరల్ ఈవెంట్ పేరుతో దుబాయ్‌కు వ్యభిచార ముఠా సభ్యులు యేడాది క్రితం తీసుకెళ్ళారు. అక్కడకు తీసుకెళ్ళే ముందు వివిధ రకాలైన పత్రాల్లో సంతకాలు చేయించుకున్నారు. ఆ తర్వాత ఆ డ్యాన్సర్‌కు ఒక స్టార్ హోటల్‌లో బస కల్పించి వ్యభిచార వృత్తిలోకి దింపారు. ఆ తర్వాత అనేక మంది జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్లను ఇదేవిధంగా సంగీత విభావరి పేరుతో దుబాయ్‌కు తీసుకెళ్ళి ఆ డ్యాన్సర్‌కు అప్పగించేవారు. ఆమె సారథ్యంలో గుట్టుచప్పుడుకాకుండా వ్యభిచార దందా కొనసాగింది. ఈ క్రమంలో ఆ ముఠా నుంచి తప్పించుకుని నగరానికి వచ్చిన కేరళ డ్యాన్సర్.. రెండు నెలల క్రితం నగర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందులో అనేక విషయాలను ఆమె వెల్లడించారు. సినిమాల్లో సరైన అవకాశాలు రాని జూనియర్ ఆర్టిస్టులు, అందమైన డ్యాన్సర్లకు అధిక డబ్బు ఆశ, లగ్జరీ లైఫ్, జీవితంలో త్వరగా స్థిరపడిపోవచ్చంటూ నమ్మబలికి దుబాయ్ తీసుకెళ్ళి వ్యభిచార వృత్తిలో దింపుతున్నట్టు తెలిపింది. కేరళకు చెందిన షకీల్ అనే మధ్యవర్తి ఈ దందాకు ప్రధాన సూత్రధారి అని తెలిపింది. ఈయన పలువురు యువతులను తన మాయ మాటలతో నమ్మించి, ఆరు నెలలు, యేడాది కాల పరిమితితో ఒప్పందం కుదుర్చుకుని దుబాయ్ తీసుకెళ్ళి పడుపువృత్తిలో దింపుతున్నట్టు వెల్లడించింది. అక్కడకు వెళ్ళిన తర్వాత అప్పు తీసుకున్నట్టుగా బలవంతంగా సంతకాలు పెట్టించుకుని, వారితో వ్యభిచారం చేయిస్తున్నట్టు తెలిపింది. ఈ కేసులో నగర పోలీసులు ఎంతో రహస్యంగా విచారిస్తూ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అలాగే, ఒక ప్రధాన మహిళా బ్రోకర్ సహా ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరి చేతుల్లో బందీలుగా ఉన్న దాదాపు వందమంది జూనియర్ ఆర్టిస్టులను కూడా రక్షించేందుకు పోలీసులు దృష్టిసారించారు.

ఇద్దరు బుల్లితెర నటీమణులు కూడా..!

ఈ వ్యభిచార ముఠా చేతిలో చిక్కి ఇద్దరు ప్రముఖ బుల్లితెర నటీమణులు కూడా మోసపోయినట్టు తెలుస్తోంది. వీరిలో ఒకరు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మంచి గుర్తింపు పొందగా, మరొకరు జల్లికట్టు ఉద్యమంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. వీరితో పాటు పలువురు జూనియర్ ఆర్టిస్టులు, బుల్లితెర, వెండితెర జూనియర్ ఆర్టిస్టులు కూడా ఉన్నట్టు సమాచారం.



కొరట్టూరు ఆలయంలో జరిగిన ఆడిశుక్రవార వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వందలాది మంది మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు.

2030 నాటికి 2.30 కోట్ల ఇళ్లకు పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరా



చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2030 నాటికి పైపుల ద్వారా వంట గ్యాస్ సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం అవసరమైన స్థల సేకరణలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సింగిల్ విండో సిస్టమ్ అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పైపుల ద్వారా గ్యాస్ సరఫరా చేయాలన్న లక్ష్యంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్థానిక ఎన్నూరు హార్బరులో ఎల్ఎన్‌జీ అనే నేచురల్ ప్లాంట్ నెలకొల్పి విదేశాల నుంచి గ్యాస్‌ను నౌకల్లో దిగుమతి చేసుకుని నిల్వ చేస్తోంది. వాహనాలకు సీఎన్‌జీ గ్యాస్, గృహ అవసరాలకు మాత్రం పీఎన్‌జీ రకం గ్యాస్ సరఫరా చేస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 2030 నాటికి 2.30 కోట్ల గృహాలకు పైపుల ద్వారా పీఎన్‌జీ, 2785 సీఎన్‌జీ కేంద్రాల ద్వారా వాహనాలకు గ్యాస్ సరఫరా చేయాలన్న ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ పనులను పూర్తి చేసేందుకు ఏడు గ్యాస్ కంపెనీలు అనుమతి పొందాయి. ప్రతి కంపెనీ నాలుగు నుంచి ఐదు జిల్లాల్లో పనులు చేపట్టేలా విభజించారు. ఈ కంపెనీలు రాష్ట్ర వ్యాప్తంగా 27,563 కిలోమీటర్ల పరిధిలో గ్యాస్ సరఫరా చేసేందుకు పైపు లైన్ల నిర్మాణం చేపట్టనున్నాయి. అయితే, ఈ నిర్మాణం కోసం నగరాల నుంచి గ్రామాల వరకు భూములను సేకరించాల్సి ఉంది.

ఈ భూములను ఆయా కంపెనీలు సేకరించడం అనేది అసాధ్యమైన పని. అందుకే సింగిల్ విండో విధానం ద్వారా అత్యంత సులభంగా భూములను సేకరించాలని అధికారులు భావిస్తున్నారు. కానీ సాధ్యాసాధ్యాలపై పలు అనుమానాలు రేగుతున్నాయి. ఇదే విషయంపై ఒక గ్యాస్ కంపెనీ ప్రతినిధి స్పందిస్తూ.. గృహాలకు పైపుల ద్వారా గ్యాస్ సరఫరా చేయాలంటూ అనేక శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉందన్నారు. ప్రతి శాఖ నుంచి అనుమతి పొందడం అనేది సాధ్యమయ్యే పనికాదని, చెన్నై మహానగరంలో మెట్రో రైల్ నిర్మాణ పనులు సాగుతున్నందున ఈ గ్యాస్ పైపు లైను నిర్మాణ పనులు రాత్రిపూట చేపట్టాల్సి ఉందన్నారు. అందువల్ల సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులు ఒకేసారి మంజూరు చేసిన పక్షంలో ఈ పైపు లైను నిర్మాణ పనులు త్వరితగతిన, సులభంగా పూర్తి చేసే అవకాశం లభిస్తుందన్నారు.

పుదుచ్చేరిలో మళ్లీ రేషన్ దుకాణాలు

ఈ ఏడాది నుంచే ప్రారంభం ● కారైక్కాల్‌లో మ్యూజియం ఏర్పాటు

- విద్యార్థులకు ఉచితంగా పాదరక్షలు, పుస్తకాలు
- ప్లస్ వన్ విద్యార్థులకు 'నీట్'పై శిక్షణ
- చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతి పెంపు

ఆరు నెలల కోసం బడ్జెట్ ● అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సీఎం రంగస్వామి



బడ్జెట్ ప్రవేశపెడుతున్న ముఖ్యమంత్రి రంగస్వామి

పుదుచ్చేరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రమైన పుదుచ్చేరిలో మళ్లీ రేషన్ దుకాణాలు ప్రారంభం కానున్నాయి. తమిళనాడు రేషన్ దుకాణాల తరహాలోనే ఈ ఏడాది నుంచే ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రంగస్వామి ప్రకటించారు. ఆర్థిక శాఖ కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)కు సంబంధించి శుక్రవారం ఉదయం 9 గంటలకు 156 పేజీల బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గత మార్చి నెలలో ఆరు నెలల ఆర్థిక బడ్జెట్‌ను దాఖలుచేసిన నేపథ్యంలో, మిగిలిన 6 నెలలకు రూ.12,700 కోట్లతో ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారు. అందులో రాష్ట్ర ఆదాయం రూ.6,914 కోట్లుగాను, కేంద్రప్రభుత్వం రూ.3,268 కోట్లు అందజేయనుండగా, మిగిలిన లోటు రూ.2,066 కోట్లు రుణంగా పొందేందుకు అనుమతి లభించిందని బడ్జెట్‌లో సీఎం ప్రకటించారు. బుధవారం లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం రంగస్వామి బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతంలో రేషన్‌కు బదులుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు వేసే విధానం ఉండేది. మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సూచనల మేరకు ఈ విధానం అమలులోకి వచ్చింది. అయితే ఇప్పుడు మళ్లీ రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు.

బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు..

- ఈ ఏడాది రేషన్ దుకాణాలు ప్రారంభించి, ఉచిత బియ్యం, రాయితీ ధరకు పప్పు ధాన్యాలు, చక్కెర, వంటనూనె తదితర సరుకులు అందజేయనున్నారు.
- రేషన్ కార్డులో పేర్ల మార్పుచేర్పులు, కొత్త రేషన్ కార్డులకు ఈ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- కారైక్కాల్‌లో మ్యూజియం ఏర్పాటు.
- భారతియార్, భారతీదాసన్ మ్యూజియంల అభివృద్ధి.
- విద్యార్థులకు పాదరక్షలు, పుస్తకాల ఉచిత పంపిణీ
- చేపల వేట నిషేధకాలంలో అందించే నివారణ సాయం రూ.6,500 నుంచి రూ.8,000కు పెంపు
- వర్షాకాల నివారణ సాయం రూ.3,000 నుంచి రూ.6,000కు పెంపు
- ప్లస్ వన్ విద్యార్థులకు 'నీట్' శిక్షణ
- పుదుచ్చేరి ప్రాంతాల వారీగా పది, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తలా రూ.20,000, రూ.15,000, రూ.10,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి.
- పాఠ్యాంశాల వారీగా 100కు 100 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5,000 ప్రోత్సాహక నగదు
- ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదివి యూజీ కోర్సుల్లో చేరిన విద్యార్థినీ, విద్యార్థులకు మూడేళ్ల పాటు నెలకు రూ.1,000 ప్రోత్సాహకం.
- షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలు తీసుకున్న తల్లిదండ్రులకు జన్మించిన పిల్లలకు రూ.10,000 ఆర్థికసాయం
- పాండిచ్చేరి యూనివర్శిటీలోని ఇందిరా గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హోమియోపతి విభాగం, డిస్పెన్సరీ ప్రారంభం
- దేవాదాయశాఖకు చెందిన దేవాలయాల్లో విగ్రహాలు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర చరాస్తులకు సంబంధించిన అన్ని పత్రాలు డాక్యుమెంటేషన్ చేసి, ప్రజల సందర్శనార్థం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్
- కార్మికుల కనీస వేతనం 2017 తర్వాత మార్పు. కొన్ని ఉద్యోగాలకు కనీస వేతనం రూ.5,220గాను, మరికొన్నింటికి రూ.13,000లుగా ఉంది. ఈ వేతనం రూ.5,220 నుంచి రూ.9,940, రూ.13,000 నుంచి రూ.23,790కి పెంపు
- పుదుచ్చేరి నగరంలో 24 గంటలు తాగునీరు అందించేలా రూ.20.38 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.52.5 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పునరుద్ధరణ
- శిథిలావస్థకు చేరుకున్న రాజ్‌నివాస్ పునర్నిర్మాణానికి రూ.14 కోట్లు కేటాయింపు
- పాత సారాయి కర్మాగార ప్రాంగణంలో రూ.13.4 కోట్లతో లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం, నివాసం నిర్మాణం.

14 వరకు సమావేశాలు

ఈ నెల 14వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. 5, 6 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 7, 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి, మంత్రులు తమ శాఖలకు సంబంధించి ప్రతిపాదనలు ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ప్రతిపాదనలపై చర్చ, ఓటింగ్ నిర్వహించనున్నారు. 12, 13 తేదీల్లో ముఖ్యమంత్రి, మంత్రులు సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం చెప్పనున్నారు. 14న తీర్మానాలపై చర్చ జరుగనుంది.

సమాచార దర్శిని

శాఖా పరీక్షల ఆన్సర్ కీ విడుదల

ఐసిఎఫ్, ఆగస్టు 2: శాఖా పరీక్షల ఆన్సర్ కీ టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. టీఎన్‌పీఎస్సీ ప్రకటించిన శాఖా పరీక్షలు జూన్ 20 నుంచి 28వ తేది వరకు చెన్నై సహా వివిధ జిల్లాల్లో జరిగాయి. ఈ పరీక్షల ఆన్సర్ కీని టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. దరఖాస్తుదారులు తాము రాసిన జవాబులను దీంతో పోల్చి చూసుకోవాలని, ఏదైనా ఆక్షేపణలుంటే 5వ తేది సాయంత్రంలోగా tnpsc.qdd @gmail.com అనే ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని అధికారులు సూచించారు.

ప్రోత్సాహక భత్యానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 2: ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహక భత్యానికి ఈ నెల 17వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 'నాన్ ముదల్‌వన్' పథకం కింద పోటీ పరీక్షల విభాగాన్ని గత ఏడాది మార్చిలో ప్రారంభించారు. ఈ పథకం కింద ప్రతి ఏటా 1,000 మంది సివిల్ సర్వీస్ చదివే విద్యార్థులకు నెలకు రూ.7,500 చొప్పున 10 నెలలు అందజేయనున్నారు. నాన్ ముదల్‌వన్ పోటీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో యూపీఎస్సీ ప్రిలిమ్స్-2025కు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రోత్సాహక భత్యం అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.naanmudhalvan.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 10వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

7న కరుణ వర్ధంతి సందర్భంగా శాంతి ర్యాలీ

పెరంబూర్, ఆగస్టు 2: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 6వ వర్ధంతి సందర్భంగా డీఎంకే ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. 2018 ఆగస్టు 7వ తేది కరుణానిధి మృతిచెందారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆయన శతజయంతి వేడుకల్లో భాగంగా, ఆయన 6వ వర్ధంతి నిర్వహించనున్నారు. ఓమందూర్‌లోని కరుణానిధి విగ్రహం నుంచి ఉదయం 7 గంటలకు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నేతృత్వంలో శాంతి ర్యాలీ ప్రారంభంకానుంది. ఈ ర్యాలీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలి ఆ పార్టీ పిలుపునిచ్చింది. మెరీనా బీచ్ వరకు సాగనున్న ఈ ర్యాలీ అనంతరం అన్నా, కరుణానిధి స్మారక స్థలాల వద్ద సీఎం నివాళులర్పిస్తారని పార్టీ తెలియజేసింది.

నేటినుంచి చిత్రలేఖన ప్రదర్శన

ఐసిఎఫ్, ఆగస్టు 2: స్థానిక ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియంలో శనివారం నుంచి 5వ తేది వరకు జరుగనున్న చిత్రలేఖన ప్రదర్శనను మంత్రి స్వామినాథన్ ప్రారంభించనున్నారు. కళ, సంస్కృతి శాఖ, చెన్నై ప్రభుత్వ లలిత కళల కళాశాల ఆధ్వర్యంలో రాష్ట్ర చిత్రలేఖన, శిల్ప కళాకారుల జీవనాధార అభివృద్ధి కోసం చెన్నైలో చిత్రలేఖన సంత పేరుతో మ్యూజియం ప్రాంగణంలో మూడు రోజులు ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. చిత్రలేఖనం, శిల్ప కళ ఆవిష్కరణ, విక్రయాల కోసం 100 స్టాల్స్ ఏర్పాటుచేశారు.

ఈనెలలో జూలై నెల సరుకుల పంపిణీ

పెరంబూర్, ఆగస్టు 2: రేషన్ దుకాణాల్లో జూలై నెలకు సంబంధించి కందిపప్పు, పామాయిల్ పొందలేని వారు ఈ నెలలో తీసుకోవచ్చని వినియోగదారుల భద్రతా శాఖ తెలియజేసింది. రేషన్ దుకాణాల్లో ప్రతినెలా కందిపప్పు కిలో రూ.20, పామాయిల్ లీటరు రూ.25కు విక్రయిస్తున్నారు. టెండర్ల విడుదలలో జాప్యం కారణంగా జూన్‌లో కందిపప్పు, పామాయిల్ పొందని వారు జూలైలో పొందవచ్చని సంబంధిత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. జూలైలో కూడా సరుకుల కొరత ఏర్పడడంతో ఆ నెలలో సరుకులు పొందని వారు ఈ నెలలో పొందవచ్చని అధికారులు తెలిపారు.

కుమరి అనంతన్‌కు 'తగైసాల్ తమిళర్' పురస్కారం

ఐసిఎఫ్, ఆగస్టు 2: 'తగైసాల్ తమిళర్' పురస్కారాన్ని కుమరి అనంతన్‌కు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముఖ్యమంత్రి అందజేయనున్నారు. రాష్ట్రానికి, తమిళ జాతి అభివృద్ధి కోసం కృషిచేసిన వారిని సన్మానించేలా తగైసాల్ తమిళర్ అనే పురస్కారాన్ని అర్హులైన వారికి ప్రభుత్వం అందజేస్తోంది. ఈ పురస్కారాన్ని గత మూడేళ్లలో సీపీఎం సీనియర్ నేత శంకరయ్య, సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను, ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి తదితరులకు అందజేశారు. ఈ ఏడాది పురస్కారానికి కాంగ్రెస్ సీనియర్ నేత కుమరి అనంతన్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పురస్కారం కింద రూ.10 లక్షల చెక్, ప్రశంసాపత్రాన్ని ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం స్టాలిన్ అందజేయనున్నారు.

రేపటి నుంచి కీల్పాక్కంలో రైతు బజార్

ఐసిఎఫ్, ఆగస్టు 2: సహజ సిద్ధంగా పండించే పంటలతో మాసాంతపు రైతు బజార్ నగరంలో తొలిసారిగా ఈ నెల 4వ తేది కీల్పాక్కంలో ప్రారంభం కానుంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ సమాఖ్య, చెన్నై ఆర్గానిక్ మార్కెట్ సంయుక్తంగా రైతు బజార్ నిర్వహించనున్నాయి. కీల్పాక్కం సీఎస్ఐ బెయిన్ స్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సంత జరుగనుంది. ప్రతి నెలా మొదటి ఆదివారం ఈ ప్రాంగణంలోను, మిగిలిన రోజుల్లో ఇతర ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. 20 స్టాళ్లలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గానుగ నూనె, చిరుధాన్యాలు కొనుగోలు చేయవచ్చు. ఇతర వివరాలకు 9962043710 నెంబరు సంప్రదించవచ్చు.

కిలో వెల్లుల్లి రూ.450

ఐసిఎఫ్, ఆగస్టు 2: ఊటీ వెల్లుల్లి కిలో రూ.450కు విక్రయమవుతోంది. నీలగిరి జిల్లాలో పండే వెల్లుల్లిని ప్రతి ఆదివారం కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం మండీల్లో వేలం ద్వారా విక్రయిస్తుంటారు. ఇటీవల ఉత్తరాది వ్యాపారులు ఈ వెల్లుల్లి కొనుగోలుకు పోటీపడడం, మరోవైపు వర్షాల కారణంగా దిగుబడి తగ్గడంతో కిలో రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయమైన వెల్లుల్లి ప్రస్తుతం రూ.450కు విక్రయమవుతోంది.

చెంగల్పట్టు మార్గంలో మరో 8 రైళ్లు రద్దు

ఐసిఎఫ్, ఆగస్టు 2: తాంబరం రైల్వే యార్డులో చేపడుతున్న అభివృద్ధి పనుల కారణంగా చెంగల్పట్టు మార్గంలో శనివారం నుంచి ఈ నెల 14వ తేది వరకు ప్రస్తుతం 55 విద్యుత్ రైళ్ల సేవలు రద్దుకాగా, అదనంగా మరో 8 రైళ్లు రద్దు చేసినట్లు చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. తాంబరం-బీచ్ ఉదయం 7.17, 8.19, 9, 9.22, 9.40, 9.50, సాయంత్రం 6.26, రాత్రి 7.15 గంటల రైళ్ల సేవలు రద్దయ్యాయి. చెన్నై బీచ్-పల్లావరానికి ఉదయం 9.30, 9.45, 10, 10.15, 10.30, 11, 11.15, 11.30, 11.45, మధ్యాహ్నం 12, 12.15, 12.30, 12.45, రాత్రి 10.40, 11.05, 11.30, 11.59 గంటలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నాయి. అలాగే, పల్లావరం-చెన్నై బీచ్‌కు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

జాలరి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావాలి

● రామేశ్వరంలో మత్స్యకారుల నిరవధిక సమ్మె



తీరానికే పరిమితమైన బోట్లు

అడయార్, ఆగస్టు 2: శ్రీలంక నావికాదళం దాడిలో ప్రాణాలు కోల్పోయిన రాష్ట్రానికి చెందిన జాలరి మృతదేహాన్ని శ్రీలంక నుంచి స్వదేశానికి తీసుకుని రావాలని రామేశ్వరం ప్రాంతానికి చెందిన జాలర్లు శుక్రవారం నిరవధిక సమ్మెకు దిగారు. వారంతా చేపల వేటకు వెళ్లకుండా సముద్ర తీరంలో తమ బోట్లకు లంగరు వేశారు. రామేశ్వరం హార్బరు నుంచి బుధవారం పలువురు జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళారు. అయితే, అంతర్జాతీయ సరిహద్దులను దాటి తమ ప్రాంతంలోకి ప్రవేశించారంటూ శ్రీలంక నావికాదళం దాడి చేసింది. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మలైస్వామి (59) అనే జాలరి సముద్రంలో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోగా, రామచంద్రన్ (64) అనే జాలరి గల్లంతయ్యాడు. ముత్తు మునియాండి (64), మూక్కయ్య (54)లను లంక నావికాదళం అదుపులోకి తీసుకుని జాఫ్నాలోని నావికాదళం శిబిరానికి తరలించారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన మలైస్వామి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారులను ఆదేశించారు. ఈ మొత్తాన్ని కూడా అధికారులు మృతుడి కుటుంబానికి అందజేశారు. సముద్రంలో గల్లంతైన మలైస్వామి ఆచూకీ కనుగొని, మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రామేశ్వరం ప్రాంతానికి చెందిన జాలర్లు గత రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం చేపల వేటకు వెళ్ళకుండా నిరవధిక సమ్మెకు దిగారు.

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో దేవరకొండ భేటీ



చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ వ్యవస్థాపకులు దేవరకొండ రాజు గురువారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేవరకొండ కరోనా సమయంలో తమ సంస్థ తెలుగువారికి అందించిన సేవలను మంత్రికి వివరించారు. మంత్రి సొసైటీ అందిస్తున్న సేవలను అభినందించారు.

చెన్నై - కారైకుడి మధ్య కంభన్ ఎక్స్‌ప్రెస్ మళ్ళీ నడపాలి

● నాగై ఎంపీ డిమాండ్

అడయార్, ఆగస్టు 2: చెన్నై - కారైక్కుడి ప్రాంతాల మధ్య గతంలో నడిపిన కంభన్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలని నాగపట్టణం లోక్‌సభ సభ్యుడు వై.సెల్వరాజ్ పార్లమెంట్‌లో కోరారు. దేశంలో ప్రతి ఒక్కరూ రైలు ప్రయాణాన్ని ఇష్టపడతారు. అయితే, ఇటీవలికాలంలో దేశ వ్యాప్తంగా ప్రమాదాలు జరుగుతుండటం చూస్తుంటే భారతీయ రైల్వే సరైన ట్రాక్‌లోనే ప్రయాణం చేస్తుందా అనే సందేహం కలుగుతుందన్నారు. గతంలో చెన్నై - కారైక్కాల్ ప్రాంతాల మధ్య నడిచిన కంభన్ ఎక్స్‌ప్రెస్ సేవలను మళ్ళీ పునరుద్ధరించాలని కోరారు. అలాగే, కారైక్కాల్ - తిరువారూర్ - తంజావూరు, తిరువారూర్ - మైలాడుదురై ప్రాంతాల మధ్య రైల్వే లైనును డబుల్ లైనుగా మార్చాలని ఆయన కోరారు. వారంలో మూడు రోజుల పాటు నడుపుతున్న మన్నార్‌కుడి - తిరుపతి రైలును డైలీ నడపాలని కోరారు.

జిల్లాల్లో విద్యాభివృద్ధిపై సమావేశాలు

ఐసిఎఫ్, ఆగస్టు 2: రాష్ట్రంలోని 38 విద్యా జిల్లాల్లో విద్యాభివృద్ధిపై సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, విద్యాభివృద్ధి కోసం 38 విద్యా జిల్లాల్లో ప్రతినెలా సమావేశాలు జరుగుతున్నాయి. ఆ ప్రకారం, ఈ నెల సమావేశం త్వరలో నిర్వహించనున్నారు. విద్యార్థుల అవసరాలు, సమస్యలపై విద్యావేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

13 మంది ప్రయాణికులకు బహుమతులు

ఐసిఎఫ్, ఆగస్టు 2: గత నెలలో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని బస్సుల్లో ప్రయాణించిన 13 మందికి రవాణా శాఖ బహుమతులు అందజేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రతినెలా వారాంతపు సెలవులు, పండుగ రోజులు మినహా ఇతర రోజుల్లో ప్రయాణించేందుకు టిక్కెట్లు బుకింగ్ చేసుకొనే ప్రయాణికుల్లో ముగ్గురిని ఎంపిక చేసి వారికి తలా రూ.10,000 అందజేస్తున్నారు. ఈ పథకంలో జూన్ నుంచి 13 మందిని ఆన్‌లైన్‌లో నిర్వహించిన డ్రా ద్వారా ఎంపిక చేసి మొదటి ముగ్గురు ప్రయాణికులకు రూ.10 వేలు, మరో 10 మందికి తలా రూ2 వేలు అందజేశారు. అలాగే, జూలై నెలలో ఎంపికైన 13 మందికి త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

6 వరకు ఊటీ కొండ రైలు రద్దు



పట్టాలపై పడిన మట్టిచెరియలు, చెట్ల కొమ్మలు

పెరంబూర్, ఆగస్టు 2: మేట్టుపాళయం-ఊటీ కొండ రైలు సేవలు ఈ నెల 6వ తేది వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్ర భావంతో నీలగిరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో, కల్లార్-హిల్‌గ్రోవ్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై మట్టిచెరియలు, చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో, గురువారం మేట్టుపాళయం-ఊటీ మధ్య ఉదయం 7.10 గంటలకు బయల్దేరిన రైలు, ఊటీ-మేట్టుపాళయం మధ్య మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరే రైలు సేవలు రద్దయ్యాయి. రైలు పట్టాలపై పడిన మట్టిచెరియలు తొలగించే పనులను రైల్వే కార్మికులు చేపట్టారు. జిల్లాకు మళ్లీ భారీవర్ష సూచన ప్రకటించడంతో తొలగింపు పనుల్లో జాప్యం చోటుచేసుకొనే అవకాశముండడంతో మేట్టుపాళయం-కున్నూర్ మధ్య కొండ రైలును 6వ తేది వరకు రద్దుచేశారు. ఆ రోజుల్లో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు తిరిగి నగదు అందజేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. కాగా, కున్నూర్-ఊటీ మధ్య కొండ రైలు సేవలు యథావిధిగా సాగుతాయని ప్రకటించింది.

చెన్నై-సేలం-చెన్నై విమాన సేవల్లో మార్పులు

పెరంబూర్, ఆగస్టు 2: విమానాల శిక్షణ జరుగుతున్న నేపథ్యంలో, స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి సేలంకు, సేలం నుంచి మీనంబాక్కంకు బయల్దేరే విమానాల వేళల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ ప్రకారం, నగరం నుంచి సేలంకు ఉదయం 10.35 గంటలకు బయల్దేరే విమానం 8.20 గంటలకు బయల్దేరనుంది. అలాగే, సేలం నుంచి నగరానికి బయల్దేరే విమానం ఉదయం 11.40 గంటలకు బదులు 9.20 గంటలకు బయల్దేరుతుందని, ఈ మార్పు 7వ తేది వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

2026లో ఎన్డీయే కూటమిదే సీఎం కుర్చీ

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణన్



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న నారాయణన్

అడయార్, ఆగస్టు 2: రానున్న అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీ ఎన్డీయే కూటమిదేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణన్ తిరుపతి జోస్యం చెప్పారు. శివగంగై జిల్లా దేవకోటలో గురువారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్రంలో అధిక స్థాయిలో లబ్ధి పొందిందన్నారు. కానీ, ఇటీవల ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌తో తమిళనాడు పేరు లేదా తిరుక్కురళ్ పేర్లను ఉచ్ఛరించలేదంటూ ఉద్దేశపూర్వకంగా కొందరు ఆరోపణలు చేస్తూ, ప్రజల మనసులను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వచ్చే 2026లో జరిగే ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్డీయే కూటమి నేత రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో 2023లో జరిగిన ప్లస్ టూ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని, అంతమాత్రాన మళ్ళీ పరీక్షలు నిర్వహించారా? అని ప్రశ్నించారు. పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ కావడం వల్ల కొన్నేళ్ళుగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అలాగని ఆ పబ్లిక్ పరీక్షలను రద్దు చేశామా? అని ఆయన ప్రశ్నించారు.

వయనాడు మృతుల ఆత్మ శాంతి కోసం కామాక్షి అమ్మవారి ఆలయంలో మోక్షదీపం



పెరంబూర్, ఆగస్టు 2: కేరళ రాష్ట్రం వయనాడులో సంభవించిన విపత్తులో చిక్కి మృతిచెందిన వారి ఆత్మలు శాంతించాలని కోరుతూ కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయంలో గురువారం మోక్షదీపం వెలిగించారు. వయనాడులో జరిగిన విపత్తులో సుమారు 300 మందికి పైగా మృతిచెందగా, మరో 200 మంది ఆచూకీ లభించలేదు. ఈ వార్త కంచి మఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిని తీవ్రంగా కలచివేసింది. మృతిచెందినవారి ఆత్మలకు శాంతి చేకూరాలని, బాధిత ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుతూ కామాక్షి అమ్మవారి ఆలయంలో మోక్ష దీపం వెలిగించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ముమ్మరంగా నిత్యావసరాల ప్యాకింగ్



కందిపప్పును ప్యాకెట్లలో ఉంచుతున్న ఉద్యోగులు

పెరంబూర్, ఆగస్టు 2: రేషన్ దుకాణాల ద్వారా సరుకులను ఇకపై ప్యాకెట్లలో అందజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విష యం తెలిసిందే. రేషన్ దుకాణాలకు బస్తాల్లో సరఫరా చేసే కంది పప్పు, చక్కెర, గోధుమలు వినియోగదారులకు కొలిచి అందించే సమయంలో కొలతల్లో తేడా ఉంటుందని ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం, వినియోగదారులకు పూర్తి కొలతతో కూడిన సరుకులు ప్యాకెట్లలో అందించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియను రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో తలా రేషన్ దుకాణంలో ప్రయోగాత్మకంగా అందించి, తదుపరి అన్ని రేషన్ దుకాణాలకు విస్తరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, కందిపప్పు, గోధమలు, చక్కెర తదితరాలను ప్యాకెట్లలో నింపే పనులను సహకార శాఖ ఉద్యోగులు చేపట్టారు.

ఆలయాల సందర్శనకు అద్దెకు బస్సులు

పెరంబూర్, ఆగస్టు 2: రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన ఆలయాల సందర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తెలిపింది. నగరం నుంచి ఇతర ప్రాంతాల్లోని ఆలయాలకు వెళ్లే భక్తులకు తక్కువ ధరతో బస్సులు నడుపనున్నామని, మరిన్ని వివరాలకు 'టీఎన్ఎస్‌టీసీ' వెబ్‌సైట్ సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

చెన్నై-ఢాకా మధ్య నేరుగా విమానాలు

పెరంబూర్, ఆగస్టు 2: చెన్నై-ఢాకా మధ్య సెప్టెంబరు 3వ తేది నుంచి నేరుగా విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. వారంలో ఆరు రోజులు (సోమవారం మినహా) తక్కువ ఛార్జీతో నడుపనున్నట్లు ఎయిర్ ఎక్స్‌ప్రెస్ విమాన సంస్థ తెలిపింది. చెన్నై విమానాశ్రయం నుంచి రాత్రి 7 గంటలకు బయల్దేరే విమానం 10.10 గంటలకు ఢాకా చేరుకుంటుంది. మరుమార్గంలో ఢాకా నుంచి బయల్దేరే విమానం సాయంత్రం 4.50 గంటలకు చెన్నై చేరుకుంటుంది. చెన్నై నుంచి ఢాకాకు రూ.5,000 ఛార్జీ నిర్ణయించగా, ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొనే వారికి రూ.4,796గా నిర్ణయించారు. అలాగే, ఢాకా నుంచి చెన్నైకి రూ.7,400 ఛార్జీ నిర్ణయంచగా, ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొనే వారికి రూ.7,226గా నిర్ణయించినట్లు ఆ సంస్థ ప్రకటనలో తెలిపింది.

5న అన్నాడీఎంకే సమీక్షా సమావేశం

అడయార్, ఆగస్టు 2: ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఓటమిపై అన్నాడీఎంకే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా, గత నెల 10వ తేదీ నుంచి ఈ సమీక్షలు చేపట్టగా, ఇప్పటి వరకు 38 లోక్‌సభ స్థానాలకు సంబంధించి ఓటములపై సమీక్ష చేశారు. ఈ నెల 5వ తేదీన కరూర్, పుదుచ్చేరి లోక్‌సభ స్థానాల ఫలితాలపై సమీక్ష చేయనున్నారు. ఈ సమావేశానికి పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి అధ్యక్షత వహిస్తారని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 2: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కాలడిపేట: టీహెచ్ రోడ్డు, రాజా కడై, తిరుచ్చినాంకుప్పం, కన్నికోయిల్, అప్పర్‌స్వామి ఆలయ వీధి, కనకర్ వీధి, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, మార్కెట్ లైన్, ఎన్నూర్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు, సాతాన్ కాడు, న్యూ వీధి, వసంత నగర్, అయ్యపల్లి వీధి, శేషాచల విలేజ్ వీధి, తిలగర్ నగర్, చిన్నమేట్టుపాళయం, పెరియపాళయం, పశ్చిమ, ఉత్తర మాడవీధులు, పీకేఎన్ కాలని, వీరరాఘవన్ వీధి, కుమరన్ నగర్, గోమాత నగర్, పీపీటీ రోడ్డు

పల్లికరనై: ఏరికరై వీధి, భవాని అమ్మన్ నగర్, పల్లికరనై, పూర్వంకర ఫ్లాట్స్, వీఎస్ రోడ్డు, స్కూల్ రోడ్డు, నెహ్రూ వీధి, ఆయిల్ మిల్, మేడవాక్కం, కృష్ణా నగర్, రాధా నగర్, గోకుల్ నగర్, సౌమ్య నగర్, మాంబాక్కం మెయిన్ రోడ్డు, బాబు నగర్ మొదటి వీధి, వైష్ణవి వీధి, నీలా నగర్, శివగామి నగర్, పటేల్ రోడ్డు, ప్రభురాజా నగర్, విమలా నగర్, కోవిలంబాక్కం, నన్మంగళం, అరుణోదయ నగర్, ఏలుమలై రోడ్డు, పెరుమాళ్ నగర్, క్రోంపేట రోడ్డు, జయగణేశ్ నగర్, అరుళ్ మురుగన్ నందన వనం, ఇందిరపురి, అంబేడ్కర్ రోడ్డు, బలరామన్ వీధి, సిద్ధార్థ్ అవెన్యూ, నందంబాక్కం, కొలపాక్కం, నారాయణన్ నగర్, రామచంద్ర నగర్, పట్టమ్మాళ్ గార్డన్, కొలపాక్కం కాలని, రామమూర్తి అవెన్యూ, వీజీఎన్ విల్లా, దేవి కరుమారియమ్మన్ నగర్, మేక్ వర్త్ నగర్, వత్తవాడై వీధి, ఎంజీఆర్ నగర్, మహాలక్ష్మి నగర్, థెరిస్సా నగర్. **మొగలివాక్కం:** శాంతి నగర్, అయ్యప్పన్ ఆలయ వీధి, శబరి నగర్, కృష్ణవేణి నగర్, ఏజీఎస్ కాలని, కుముదం నగర్, కార్తీక్ బాలాజీ నగర్, లలితాంబాల్ నగర్, మనపాక్కం మెయిన్ రోడ్డు, రామాపురం తమిళ్ నగర్, గిరి నగర్, ఆనందం నగర్, ఆనందం నగర్ మెయిన్ రోడ్డు, కురింజి నగర్, గంగైయమ్మన్ ఆలయ వీధి, నాయుడు వీధి, అంబాల్ నగర్, బాలాంబిగై నగర్. **అడయార్:** వెంకటేశ్వర నగర్ 1 నుంచి 5 వీధులు, జీవరత్నం నగర్ 1,2 వీధులు, కర్పగం గార్డన్ 1 నుంచి 7 క్రాస్ వీధులు, కర్పగం గార్డన్ మొదటి మెయిన్ రోడ్డు, బీసెంట్ నగర్ బీచ్ హోం అవెన్యూ, దామోదరపురం, బెన్‌కో కాలనీ, కస్టమ్స్ కాలని, పాత సీపీడబ్ల్యూ క్వార్టర్స్, 4వ అవెన్యూ

మడిపాక్కం: షీలా నగర్, అన్నై థెరిస్సా నగర్, సదాశివం నగర్, గోవిందస్వామి నగర్, రాజాజీ నగర్, రామ్‌నగర్ సౌత్, కుబేరన్ నగర్, మహాలక్ష్మి నగర్, రామ్ నగర్ నార్త్, రాజరాజేశ్వరి నగర్, భజన ఆలయ వీధి, పెరియార్ నగర్, ట్యాంక్ బండ్ వీధి, అన్నానగర్, రాజ్యలక్ష్మి నగర్

ఐటీ కారిడార్: ఎంసీఎన్ నగర్, ఎంసీఎన్ నగర్ ఎక్స్‌టెన్షన్, ఫౌండ్రీ రోడ్డు, పిల్లయార్ ఆలయ వీధి, ఎస్బీఐ కాలని, గంగైయమ్మన్ ఆలయ వీధి, 200 అడుగుల రేడియల్ రోడ్డు, పోస్టాఫీసు వీధి, వేంబులి అమ్మన్ ఆలయ వీధి, తేరడి వీధి, పంచాయతి రోడ్డు, కులక్కరై వీధి, ఆర్ముగం అవెన్యూ, కుమరన్ నగర్, ఆనంద్ నగర్, ఆర్‌ఈ నగర్, బాలాజి నగర్, వినాయక నగర్, సాయి నగర్, సెల్వగణపతి అవెన్యూ, శరవణ నగర్, సెల్వకుమార్ అవెన్యూ, సీవరం, తనికాచలం వీధి, రామచంద్రన్ వీధి, కామరాజ్ వీధి, ఎస్టేట్ రోడ్డు, ఎంజీ రోడ్డు, బాలవినాయకర్ అవెన్యూ, ప్రకాశం వీధి, ఎల్లయమ్మన్ నగర్, శ్రీపురం రోడ్డు, రామన్ నగర్, ఓఎంఆర్, తిరుమలై నగర్, రామప్ప నగర్, సీబీఐ కాలని, రాజీవ్ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, ఐఐటీ కాలని, మీనాక్షిపురం, మనోహర్ నగర్, వీజీపీ శాంతి నగర్.

చర్చలు అంటే ఆత్మహత్యతో సమానం

● మంత్రి దురైమురుగన్



రైల్వే వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, ఆగస్టు 2: మెకెదాటు డ్యాం వ్యవహారంలో రెండు రాష్ట్రాల చర్చల ద్వారా పరిష్కారం అవుతుందనేది ఆత్మహత్యతో సమానమని నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ అభివర్ణించారు. కాట్పాడి సమీపం సేనూరు-లత్తేరి మధ్య రూ.29 కోట్లతో నిర్మించిన రైల్వే వంతెనకు శుక్రవారం మంత్రి దురైమురుగన్ భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... మెకెదాటు డ్యాం వ్యవహారంలో 38 సార్లు చర్చలు జరిపినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ట్రిబ్యునల్‌కు వెళ్లామన్నారు. ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కరుణానిధి అప్పటి ప్రధాని దేవగౌడను సంప్రదించి మూడు రోజులు చర్చించినా ఫలితం శూన్యమని తెలిపారు. ఈ విషయమై రాష్ట్రప్రభుత్వ చర్చలు జరిపినా కర్ణాటక ప్రభుత్వం అంగీకరించలేదన్నారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వెళ్తే మరో రెండేళ్లు జాప్యం జరుగుతుందన్నారు. కేసు విచారణ సమయంలో చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటామని కర్ణాటక ప్రభుత్వం చెబుతుదని, దీంతో కేసు విచారణను సుప్రీంకోర్టు ముగిస్తుందని, తదుపరి చర్చలకు కర్ణాటక ప్రభుత్వం ముందుకు రాదన్నారు. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ రెండు రాష్ట్రాల మంత్రులు చర్చించి పరిష్కరించుకోవాలని పేర్కొనడం ఆత్మహత్యతో సమానమని మంత్రి దురైమురుగన్ తెలిపారు.

ఆర్థికాభివృద్ధి కోసం కీలక ఒప్పందం

అడయార్, ఆగస్టు 2: భారత్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న యాప్స్ బిజినెస్ ఐటీ సొల్యూషన్స్ (ఏబీఐటీఎస్), దేశ ఆర్థికాభివృద్ధి కోసం ఎం-ఫైల్స్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఏబీఐటీఎస్ కంపెనీ అంతర్జాతీయంగా ఐటీ కన్సల్టింగ్, బిజినెస్ సాఫ్ట్‌వేర్ సర్వీస్‌లను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఫైనాన్షియల్ ఐటీ కంపెనీగా గుర్తింపు పొందిన ఎం-ఫైల్‌తో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా దేశంలో నాలెడ్జ్ వర్క్ ఆటోమేషన్ సొల్యూషన్స్‌తో పాటు ఉపాధి అవకాశాలను కల్పించనుంది. ముఖ్యంగా 500 మందికి ప్రత్యక్ష, 2 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏబీఐటీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ కామకోటి శుక్రవారం ఇక్కడ విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

త్వరలోనే మదురై ఎయిమ్స్ నిర్మాణ పనులు : జేపీ నడ్డా

అడయార్, ఆగస్టు 2: మదురైలో ఎయిమ్స్ వైద్య కళాశాల పక్కా భవనాల నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా తెలిపారు. మదురై ఎయిమ్స్ గురించి డీఎంకే ఎంపీ ఏ.రాజా లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, మదురై ఎయిమ్స్ నిర్మాణంలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. సాంకేతిక కారణాల వల్లే ఈ నిర్మాణ పనులే జాప్యానికి కారణమన్నారు. అయినప్పటికీ ఈ నిర్మాణ పనులు అతి త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి జేపీ నడ్డా సమాధానమిచ్చారు.

వర్గీకరణకు మద్దతిచ్చిన చంద్రబాబు, మోదీకి ధన్యవాదాలు

● ద్రావిడదేశం అధ్యక్షుడు కృష్ణారావు

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణకు మద్దతిచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్ర మోదికి ద్రావిడ దేశం అధ్యక్షులు కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. అనేక దశాబ్దాలుగా వంచనకు గురై, రిజర్వేషన్లలో తమ వాటా పొందలేక ఎంతో వెనుకబడిన మాదిగ సామాజికవర్గం వారికి నైతికంగా మద్దతు తెలిపి వర్గీకరణ అమలుపరిచిన ఏపీ సీఎం చంద్రబాబు, గత సంవత్సరం నవంబర్ 9న హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభలో వర్గీకరణకు బహిరంగంగా మద్దతు తెలిపిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ద్రావిడదేశం అధ్యక్షుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కృష్ణారావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. మూడు దశాబ్దాల క్రితం ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్)ను స్థాపించి ఎలాంటి పదవులు ఆశించకుండా అలుపెరగని, రాజీలేని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగను ప్రకాశం జిల్లా వాసిగా ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. చెన్నైలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సభల్లో మందకృష్ణమాదిగతో పాటు ద్రావిడదేశం కూడా పాల్గొని వర్గీకరణకు మద్దతు తెలిపిన విషయం ఈ సందర్భంగా కృష్ణారావు గుర్తు చేశారు.

గుట్కా అవినీతి కేసులో మాజీ మంత్రులకు సమన్లు

పెరంబూర్, ఆగస్టు 2: గుట్కా అవినీతి వ్యవహారంలో అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రులు సి.విజయభాస్కర్, బీవీ రమణ హాజరుకావాలని చెన్నై ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘించి అధికారులకు లంచమిచ్చి గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు సీబీఐ కేసు నమోదుచేసింది. ఈ కేసులో మాధవరావు, ఉమా శంకర్ గుప్తా సహా ఆరుగురిపై ఛార్జీషీటు దాఖలైంది. ఈ నేపథ్యంలో, సెప్టెంబరు 9వ తేది హాజరుకావాలని సి.విజయభాస్కర్, బీవీ రమణ, మాజీ డీజీపీ టీకే రాజేంద్రన్, మాజీ కమిషనర్ జార్జ్, కేంద, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సహా మొత్తం 27 మందికి ఈ కేసు విచారిస్తున్న చెన్నై ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సంజయ్‌బాబా ఉత్తర్వులు జారీచేశారు.

జువెనల్ హోం నుంచి ఇద్దరి పరారీ

పెరంబూర్, ఆగస్టు 2: స్థానిక పుళ్ళల్ నైనియప్పన్ నాయకర్ వీధిలో ఉన్న జువెనల్ హోం నుంచి ఇద్దరు బాలురు తప్పించుకు పారిపోయారు. హోం ప్రహరీ గోడ దూకి ఇద్దరు బాలురు తప్పించుకున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. తప్పించుకున్న వారిలో ఒక బాలుడు ఎర్నావూర్‌లోని తన ఇంటికి వెళ్లినట్లు సమాచారం అందగా, మరొక బాలుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బీచ్‌లో కత్తి చూపించి రూ.4 వేలు దోపిడి

పెరంబూర్, ఆగస్టు 2: స్థానిక మెరీనా బీచ్‌లో కత్తి చూపించి ఓ వ్యక్తి నుంచి రూ.4 వేలు కాజేసి పరారైన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కన్నగై విగ్రహం వెనుక భాగంలో గురువారం రాత్రి కృష్ణా అనే వ్యక్తి కూర్చొని ఉన్నాడు. ఆ సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నాడని గమనించిన ముగ్గురు వ్యక్తులు, అతడిని కత్తితో బెదిరించి రూ.4 వేలు లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో అన్నా స్క్వేయర్ పోలీసులు, పరారైన అగంతకుల కోసం గాలిస్తున్నారు.

అవయవదానం చేసిన వ్యక్తికి నివాళి

ఐసిఎఫ్, ఆగస్టు 2: ప్రమాదంలో మెదడు నిర్జీవమైన వ్యక్తి మరికొందరికి పునర్జన్మ ప్రసాదించారు. పెరంబూర్ మేట్టుపాళయం ఉప్పండి బాబు వీధికి చెందిన నారాయణన్ (57) వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు అలిమేలు అనే భార్య, నలుగురు పిల్లలున్నారు. గత నెల 29వ తేది భార్య పని చేసే ఆస్పత్రికి వెళ్లి కామరాజ్ నగర్ మీదుగా ఇంటికి వస్తున్న నారాయణన్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆయనను వెంటనే స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక గురువారం ఆయన మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో వైద్యులు ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా కాలేయం, రెండు కిడ్నీలు, నేత్రాలు తీశారు. అవయవదానం చేసిన నారాయణన్ భౌతికకాయానికి రాయపురం ఎమ్మెల్యే ఐడ్రీమ్ మూర్తి సహా వైద్యులు, సిబ్బంది నివాళులర్పించారు.

పాదయాత్ర భక్తులపై దూసుకెళ్లిన లారీ

● ముగ్గురి మృతి



మృతులు (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 2: విరుదునగర్ జిల్లా సాత్తూర్ సమీపంలోని ఇరుక్కాంగుడి మారియమ్మన్ ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులపై లారీ దూసుకెళ్లడంతో ముగ్గురు మృతిచెందారు. దీనికి సంబంధించి వివరాలిలా.. ఈ ఆలయంలో ఆడి మాసం వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోయిల్ సమీపం మేలనీలిదనల్లూర్ గ్రామానికి చెందిన 160 మంది భక్తులు ఐదు బృందాలుగా మారియమ్మన్ ఆలయానికి పాదయాత్రగా బయల్దేరారు. శుక్రవారం ఉదయం సాత్తూర్ సమీపం నల్లి ప్రాంతంలోని మదురై జాతీయ రహదారిపై భక్తులు వస్తున్న సమయంలో తిరునల్వేలి నుంచి శివగంగ వైపు సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మహేష్ (35), పవున్‌రాజ్ (45), మురుగన్ (45) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న సాత్తూర్ తాలూకా పోలీసులు అక్కడకు చేరుకొని స్వల్పగాయాలైన భక్తులను సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మణికంఠన్ ఆ సమయంలో కునుకు తీయడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, అతడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.


రియోరాజ్, యువన్, స్వినీత్ కుమార్

యువన్ శంకర్ నిర్మాతగా 'స్వీట్‌హార్ట్'

ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా నిర్మాతగా 'స్వీట్‌హార్ట్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతుంది. 'నెంజముండు నేర్మైయుండు', 'జో' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన రియోరాజ్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. స్వినీత్ ఎస్.సుకుమార్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా టైటిల్ ప్రోమో వీడియోను చిత్ర బృందం తాజాగా రిలీజ్ చేసింది. ఇందులో గోపిక రమేష్, రెడిన్ కింగ్స్లీ, రెంజీ పాణికర్, అరుణాచలేశ్వరన్, తులసి తదితరులు నటించారు. సమకాలీన ప్రేమ కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రియోరాజ్ హీరోగా నటించిన 'జో' సినిమా ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఇపుడు 'స్వీట్‌హార్ట్'ను కూడా అలాంటి కథాంశంతోనూ రూపొందించడం గమనార్హం. కాగా, ఈ కొత్త సినిమా ప్రోమోను చూసిన అభిమానులు చిత్ర బృందాన్ని అభినందిస్తున్నారు.

చిత్రజ్యోతి

కార్తీ కోసం ముగ్గురు భామలు?


ఆషికా రంగనాథన్

హీరో కార్తీ ముగ్గురు భామలతో రొమాన్స్ చేయనున్నారు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో 2022లో వచ్చిన 'సర్దార్' చిత్రం రెండో భాగం తెరకెక్కుతుంది. తొలిభాగంలో హీరోయిన్లుగా రాశీఖన్నా, రజీషా విజయన్, లైలా నటించారు. ఈ సినిమా ప్రేక్షకాదారణ పొందడంతో పాటు నిర్మాతలకు, పంపిణీదారులకు లాభాల పంట పడించింది. ఇందులో హీరో కార్తీ రా అధికారిగా, పోలీస్ ఆఫీసర్ పాత్రల్లో తండ్రీకొడుకులుగా నటించారు. ఇపుడు ఈ చిత్రానికి సీక్వెల్ రూపొందిస్తున్నారు. ఇటీవలే సెట్స్‌పైకి తీసుకెళ్ళారు. దర్శక నటుడు ఎస్‌జే సూర్య వంటి పలువురు అగ్ర నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే, హీరోయిన్లుగా తొలిభాగంలో నటించిన వారిని కాకుండా కొత్తవారిని తీసుకోవాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. ఇందుకోసం మాళవికా మోహనన్, ప్రియాంకా మోహన్‌తో పాటు టాలీవుడ్ హీరోయిన్ ఆషికా రంగనాథన్‌ను ఎంపిక చేసినట్టు సమాచారం. అయితే, కథానాయికల ఎంపికకు సంబంధించి నిర్మాణ సంస్థ అధికారపూర్వక ప్రకటన చేయాల్సివుంది.

సంక్రాంతి రేసులో ఆ ముగ్గురి చిత్రాలు?

వచ్చే యేడాది సంక్రాంతి రేసులో ముగ్గురు అగ్రహీరోలు వెండితెరపై తలపడనున్నారు. విశ్వనటుడు కమల్ హాసన్, అజిత్ కుమార్, శివకార్తికేయన్ నటించిన చిత్రాలు పొంగల్‌కు విడుదలకానున్నాయి. 'నాయకన్' సినిమా తర్వాత 38 యేళ్ళ గ్యాప్ అనంతరం మణిరత్నం - కమల్ హాసన్ కలిసి పనిచేస్తున్న 'థగ్‌లైఫ్' చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే డబ్బింగ్ ప్రారంభంకాగా, హీరో శింబు గెస్ట్ రోల్‌కు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా నిర్మాణాంతర పనులన్నీ పూర్తి చేసి సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అలాగే, మగిళ్ తిరుమేని దర్శకత్వంలో హీరో అజిత్ కుమార్ నటిస్తున్న కొత్త చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. లైకా ప్రొడక్షన్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తుంది. యాక్షన్ కింగ్ అర్జున్ విలన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెల్సిందే. ఇకపోతే, 'అయలాన్' వంటి హిట్ తర్వాత శివకార్తికేయన్ నటించిన 'అమరన్' సినిమా ఈ నెల 15న విడుదలకానుంది. ఆ తర్వాత ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ తన 23వ సినిమాలో నటిస్తున్నారు. ఇప్పటికే సింహభాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. రుక్మిణి హీరోయిన్‌కాగా, అనిరుధ్ సంగీతం. మిగిలిన నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసి సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేశారు. ఈ మూడు సినిమాలు సంక్రాంతికి విడుదలైతే అభిమానులకు సంక్రాంతి రెట్టింపుకానుంది.


'థగ్‌లైఫ్'లో కమల్ హాసన్

హీరో ప్రశాంత్‌కు రూ.2 వేల అపరాధం!

హీరో ప్రశాంత్‌కు గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు రూ.2 వేల అపరాధం విధించారు. శిరస్త్రాణం (హెల్మెట్) లేకుండా ద్విచక్రవాహనం నడిపినందుకు పోలీసులు ఫైన్ వేశారు. అతడే కాకుండా బైక్ వెనుక సీటులో కూర్చొన్న మహిళా యాంకర్ కూడా హెల్మెట్ ధరించలేదు. దీంతో కొత్త వాహన చట్టం ప్రకారం ఇద్దరికీ రూ.వెయ్యి చొప్పున రూ.2 వేల అపరాధం విధించారు. హీరో ప్రశాంత్ నటించిన 'అందగన్' చిత్రం ఈ నెల 9వ తేదీన విడుదలకానుంది. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఓ యూట్యూబ్ చానెల్‌కు హీరో ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా బైక్ నడుపుతూనే తాను చిన్నవయసులో ద్విచక్రవాహనం నడపటం నేర్చుకున్న అనుభవాలను వివరించారు. దీనికి సంబంధించిన వీడియో ఒక సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీన్ని చూసిన పలువురు నెటిజన్లు.. బాధ్యతగల హీరో ఒకరు హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపడం ఏమిటని విమర్శలు గుప్పించారు. ఈ విషయం ట్రాఫిక్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వెంటనే స్పందించిన వారు రూ.2 వేల అపరాధం విధిస్తూ, ఆ జరిమానా చలానాను కూడా షేర్ చేశారు. దీంతో ఈ వార్త వైరల్ అయింది. మరోవైపు పోలీసుల చర్యపై నటుడు ప్రశాంత్ తనదైనశైలిలో స్పందించారు. 'గత యేడాది కాలంలో శిరస్త్రాణంపై విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నాను. చెన్నై, తిరుచ్చి, నాగర్‌కోయిల్, మదురై ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేస్తూ, డ్రైవింగ్‌పై ఎన్నో జాగ్రత్తలు, సూచనలు చేస్తున్నాను. హెల్మెట్ ధరించి బైకు నడపడం వల్ల నాకు ఎలాంటి లాభం లేదు... మీకు మీ కుటుంబానికి ఎంతో సురక్షితం. తాజా సంఘటనతో తన ప్రచారానికి వేదిక లభించింది' అని పేర్కొన్నారు.



హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న ప్రశాంత్

ఘనంగా అన్నకూట మహోత్సవం



పాలబిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న పాలకమండలి సభ్యులు, భక్తులు - అన్నకూట మహోత్సవ వేడుక

ప్యారీస్, ఆగస్టు 2: ఆడిమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్యారీస్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నకూట మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు ఎస్‌కేపీ మహిళా కళాశాల ప్రాంగణంలో 102 పాలబిందెలతో పూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల నేతృత్వంలో వాసవీ అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి పాలబిందెలతో మహిళలు, ఆలయ పాలకమండలి సభ్యులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం ఆలయ మహామండపం వద్ద 102 కిలోల అన్నాన్ని రాశిగా పోసి అలంకరించి దానిని ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ ఉత్సవంలో ఆలయ ధర్మకర్త కొల్లా వేంకట చంద్రశేఖర్‌తో పాటు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


భక్తులకు మిరప పొడితో అభిషేకం


ఒంటిపై గుచ్చిన శూలాలపై దీపాలతో భక్తుడు

నాగవల్లి అమ్మవారికి ఘనంగా ఆడిశుక్రవార ఉత్సవం


నోటికి శూలాలు గుచ్చుకొని ఆలయానికి వస్తున్న భక్తులు

ఆలయానికి వస్తున్న భక్తులు

నడుముకు ఇనుప కొక్కలు తగిలించుకొని బండిని లాగుతూ వస్తున్న భక్తులు

పెరంబూర్, ఆగస్టు 2: స్థానిక కొరట్టూరు ఆలయంలో జరిగిన ఆడిశుక్రవార వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో ఆడిమాసం వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. అమ్మవారి ఆలయాలకు వెళ్తున్న భక్తులు మొక్కులు చెల్లించుకుంటుంటారు. ఈ నేపథ్యంలో, ఆడిమాసం రెండవ శుక్రవారం సందర్భంగా కొరట్టూరు నాగవల్లి అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పూల కావళ్ళు, పాల కావళ్ళు, పన్నీరు కావళ్ళు వివిధ రకాల కావళ్ళతో, శరీరానికి, నోటికి శూలాలు గుచ్చుకొని ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అభిషేకం చేసి, అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తుల్లో కొందరు తలనీలాలను సమర్పించారు. ఈ వేడుకలు ప్రశాంతంగా సాగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు దారిపొడవునా ఆలయానికి వస్తున్న భక్తులకు తాగునీరు, శీతల పానీయాలు అందజేశారు.

నేడు చెన్నై-కాట్పాడి మధ్య వందే మెట్రో రైలు ట్రయల్ రన్



పెరంబూర్, ఆగస్టు 2: స్థానిక ఐసీఎఫ్ కర్మాగారంలో తయారైన వందే మెట్రోరైలు ట్రయల్ రన్ శనివారం చెన్నై-కాట్పాడి మధ్య నిర్వహించనున్నారు. ఐసీఎఫ్‌లో ప్రస్తుతం వందే భారత్ రైళ్ల తయారీ ముమ్మరంగా జరుగుతోంది. ఇవి మినహా, అమృత్ భారత్ రైలు (సాధారణ వందే భారత్ రైలు), వందే మెట్రో రైలు కూడా తయారుచేస్తున్నారు. తొలి వందే మెట్రోరైలు తయారీపనులు గత నెలలో ముగిశాయి. అనంతరం ఐసీఎఫ్ సమీపంలో రైలును ప్రయోగాత్మకంగా నడిపి పరీక్షించారు. ఈ నేపథ్యంలో, ఈ రైలు ట్రయల్ రన్ శనివారం చెన్నై-కాట్పాడి మధ్య నిర్వహించనున్నారు. రైల్వే రీసెర్చ్ డిజైన్ అండ్ క్వాలిటీ సిస్టమ్, కమిషనర్ ఆఫ్ రైలే సేఫ్టీ విభాగాల ఉన్నతాధికారులు, ఐసీఎఫ్ అధికారులు ఇందులో పాల్గొననున్నారు. ఈ విషయమై ఐసీఎఫ్ అధికారి మాట్లాడుతూ... 12 బోగీలున్న ఈ రైలు లో ఏసీ, ఆకర్షణీయమైన ఇంటీరియల్ డెకరేషన్, లగ్జరీ సీట్లు తదితర ప్రాథమిక సౌకర్యాలుంటాయని, నిఘా కెమెరాలు, అత్యాధునిక టాయిలెట్లు, ఆటోమేటిక్ తలుపులుంటాయన్నారు.. ఒక్కో బోగీలో 104 మంది కూర్చొని, మరో 200 మంది నిల్చొని ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ రైలు ట్రయల్ రన్ శనివారం విల్లివాక్కం నుంచి ఉదయం 8.15 గంటలకు బయల్దేరి, 9 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి 9.30 గంటలకు బయల్దేరి 10.10 గంటలకు విల్లివాక్కం చేరుకొని, 10.15 గంటలకు బయల్దేరి అరక్కోణం మీదుగా 11.55 గంటలకు కాట్పాడి చేరుకుంటుందని తెలిపారు. కాట్పాడి నుండి మధ్యాహ్నం 12.15 గంటలకు బయల్దేరి 2 గంటలకు చెన్నై బీచ్‌కు చేరుకుంటుందన్నారు. ట్రయల్ రన్ సందర్భంగా గంటకు రూ.180 కి.మీ వేగంతో రైలు నడవనున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడాకారులకు దక్షిణ రైల్వే జీఎం అభినందన


క్రీడాకారులతో దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ తదితరులు

పెరంబూర్, ఆగస్టు 2: ఇటీవల ముంబైలో జరిగిన 64వ ఆలిండియా ఇంటర్ రైల్వే అక్వాటిక్స్ ఛాంపియన్ షిప్-2024-25ల్లో దక్షణ రైల్వే ఆక్వాటిక్స్ టీమ్ ప్రతిభ కనపరిచింది. ఈ టీమ్ మొత్తం 4 స్వర్ణాలు, 5 రజతాలు, 8 కాంస్య పతకాలు సాధించి ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. ఈ టీమ్ శుక్రవారం దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఆర్ఎన్.సింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జీఎం అభినందించారు. కార్యక్రమంలో దక్షిణ రైల్వే క్రీడా సమాఖ్య అధ్యక్షుడు సోమేష్‌కుమార్, సెక్రటరీ దేవరాజన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. అలాగే, జబల్‌పూర్‌లో జరిగిన అలిండియా రైల్వే వ్యక్తిగత చెస్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన వారిని కూడా జీఎం అభినందించారు.

కొల్లిమలైలో ఫ్లవర్ షో ప్రారంభం


ఫ్లవర్ షో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నుస్వామి, అధికారులు

పెరంబూర్, ఆగస్టు 2: నామక్కల్ జిల్లా కొల్లిమలై పుష్ప ప్రదర్శన, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏటా కొలిమలై సెమ్మేడు వల్విల్ ఏరి ఆడిటోరియంలో ఈ ప్రదర్శన నిర్వహిస్తుంటారు. ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే కె.పొన్నుస్వామి ప్రారంభించారు. అలాగే, 22 ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్ కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 50,000 రోజా పూలతో ఏనుగు, అక్టోపస్, చేప, ప్రేమికుల చిహ్నం, సీతాకోకచిలుక, కాయగూరలతో నెమలి సహా పలు ఆకృతులు రూపొందించారు. మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుందని జిల్లా యంత్రాంగం తెలిపింది.


ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న పూలతో చేసిన నమూనాలు

వయనాడ్ బాధితులకు నయనతార దంపతులు రూ.20 లక్షల విరాళం


విఘ్నేష్ శివన్ - నయనతార

అడయార్, ఆగస్టు 2: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు పెద్ద మనసుతో విరాళాలు ప్రకటిస్తున్నారు. ఇందులోభాగంగా, స్టార్ హీరోయిన్ నయనతార, దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతులు శుక్రవారం రూ.20 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయనున్నట్టు వారు ప్రకటించారు.

విద్యార్థులు అదనపు విద్య నేర్చుకోవాలి

● డాక్టర్ దిట్టకవి అనంత పద్మనాభ మూర్తి


అంతర్ శాఖల క్విజ్ పోటీ విజేతలతో అతిథులు

అడయార్, ఆగస్టు 2: విద్యార్థులు ఈ వయసులోనే వీలైనన్ని డిగ్రీలతో పాటు అదనపు విద్యలు నేర్చుకోవాలని లెజెండరీ నటి దివంగత సూర్యకాంతం కుమారుడు, డాక్టర్ దిట్టకవి పద్మనాభ మూర్తి సూచించారు. స్థానిక పట్టాభిరామ్‌లోని హిందూ కాలేజీ తెలుగు శాఖ, తెలుగు భాషా సమితి సంయుక్తంగా జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, రంగస్థల ప్రముఖ నట శిరోమణి బళ్ళారి రాఘవ జయంతులను పురస్కరించుకుని ఈ విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన అనంత పద్మనాభ మూర్తి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యార్థులు మాత్రమే కాదు ప్రతి ఒక్కరూ అనేక విద్యలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం అత్యంత అవసరమని, చదువుతోపాటు ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన కాలేజీ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజేంద్రనాయుడు మాట్లాడుతూ మహానటి సూర్యకాంతం తనయుడు కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం అదృష్టమన్నారు. విద్యార్థులు తెలుగు చదువుకుంటే ఈ కాలంలో అనేక ఉద్యోగాలున్నాయన్నారు. అంతకుముందుకు పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవ చిత్రపటాలకు కళాశాల ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ జి.కల్పిక్కరసి, డాక్టర్ రాజేంద్ర నాయుడు, డాక్టర్ అనంద పద్మనాభ మూర్తి, తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ తుమ్మపూడి కల్పన, శాఖాధ్యక్షుడు డాక్టర్ సురేష్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కీర్తన ప్రార్థనా గీతాన్ని ఆలపించగా, బీఏ తెలుగు విద్యార్థి ఆనెస్ట్ రాజ్ బాబు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.